


# మన మాట

ప్రతి పదం ప్రజల పక్షం

TELANAGANA సంపుటి 7 సంచిక 21

Stv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

సోమవారం । 7 ఏప్రిల్ । 2025 । పేజీలు : 6

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


ముక్కోటి దేవతలున్నారు. ఎందరో దేవుళ్లున్నారు.
అందరూ ఒకెత్తు. శ్రీరామచంద్రమూర్తి ఒక్కరూ ఒక ఎత్తు.
ఎందుకంటే మనకున్న దేవుళ్లలో అందరికీ
అన్నింటా ఆదర్శంగా నిలిచిన వారిలో రాముడే అగ్రగాముడు.
అందుకే మన దేశంలో రామాలయం లేని ఊరే ఉండదు.
ఇంటింటా రామనామస్మరణ చేయని జీవి ఉండడు.





## సకలగుణాభిరాముడు

# రఘుకుల సోముడు

### అందరూ మెచ్చిన దేవుడు అందరికీ ఆదర్శం శ్రీరాముడు

ఎప్పుడో వేల సంవత్సరాల క్రితం మనుషుల మధ్య మనిషిగా అవతరించిన రాముడు ఇప్పటికీ జనం గుండెల్లో నిలిచిపోయాడు. అందరి హృదయాల్లో కొలువు తీరాడు. అందుకేగా శ్రీరామ నవమి వస్తే చాలు ఊరూ వాడా సీతారామ కళ్యాణ వైభోగంతో కళ కళ లాడిపోతుంది. రామనామ జపంతో మార్మోగిపోతుంది. అయోధ్య రాముడైనా భద్రాద్రి దేవుడైనా ఒంటిమిట్ట రాముడైనా భక్తులకు కొంగు బంగారమే. శ్రీరామ నవమి సందర్భంగా అసలు రాముని జీవితం వేల సంవత్సరాల తర్వాతకూడా కోట్లాది మందికి ఎలా జీవన పాఠం అవుతోందో తెలుసుకోవాలంటే అసలు రాముడిలోని సకల గుణాల గురించి నైపుణ్యాల గురించి తెలుసుకోవాలి. ఆ దేవదేవుని గొప్పతనం గురించి చదువుకోవాలి.

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే

రామ అన్న శబ్దాన్ని స్మరిస్తే చాలు. వేయి సహస్ర నామాలను పఠించనంత పుణ్యం కలుగుతుంది. రామ



అన్న శబ్దంతో మమేకం అయితే చాలు. జన్మజన్మలుగా ఆత్మను అంటిపెట్టుకుని ఉన్న కర్మఫలాలు దహించుకుపోతాయి. రామో విగ్రహ వాన్ ధర్మః. రాముడు ధర్మ స్వరూపుడని రాక్షసుడైన మారీచుడే చెప్పాడు. వ్యక్తి ధర్మాలను ఎలా ఆచరించాలో మానవ లోకానికి చూపించిన మర్యాదా పురుషోత్తముడు శ్రీరాముడు. రామాయణం అంటే రాముడి కథ మాత్రమే కాదు. మన బతుకు కథలో సమస్యలను



సంహరించే రామబాణం అది. ఒకటే బాణం. ఒకటే ధర్మం. రామ బాణానికి తిరుగులేదు. రాము డిచ్చిన మాటకి ఎదురులేదు. సత్యవాక్కు పరిపాల కుడైన రామచంద్రడు...సర్వ జీవుల పట్ల దయ కలిగినవాడు. అసూయలేని వాడు. ఆడిన మాట తప్పనివాడు. దేవతలకు కూడా భయాన్ని కలిగించే ధీశాలి. ఒక్క మాటలో చెప్పాలంటే... ఆయన సకల గుణాభిరాముడు. ఎప్పటి త్రేతా యుగం ? ఎప్పటి రాముడు ? నేటికీ దేశంలో



రామ మందిరం లేని ఊరు, పూజా మందిరంలో రాముడు లేని గృహం ఉండవు. యుగయుగాలకు రాముడు ఎందుకంత ఆదర్శప్రాయుడయ్యాడు ? ఎందుకంటే... ఆయనది ఒకటే బాణం. ఒకటే ధర్మం... కాబట్టి. ఒకటే బాణం. ఒకటే ధర్మం. ఒకటే మాట. ఉత్తమ జీవితానికి, అత్యుత్తమ పాలనకి నిలువెత్తు నిదర్శనం శ్రీరామచంద్రుడు. రామరాజ్యం అంటే సకల శుభాలకు నెలవు. ధర్మానికి కొలువు. రాముడు ధైర్యవంతుడు, సత్యవంతుడు, సర్వ సమర్థుడు. క్రోధాన్ని జయించినవాడు, సకల ప్రాణుల శ్రేయస్సు కోరేవాడు. రాముడి ఔన్నత్యం, నిబద్ధతల వల్ల తను, తనవాళ్లు ఇబ్బంది పడ్డారే కానీ.... తనను నమ్మిన ప్రజలు మాత్రం తలెత్తుకు జీవించారు. కొడుకుగా, భర్తగా, తండ్రిగా రాముడు ధర్మం తప్పలేదు, తనవారిని తప్పనివ్వలేదు.



క్షత్రియునికి ప్రాథమికంగా కావలసింది పరాక్రమం. క్షతం నుంచి... అంటే దెబ్బల నుంచి రక్షించేవాడే క్షత్రియుడు. ఎందరో రాజులను సంహరించిన పరశురాముడు సుక్షత్రియుడైన రామచంద్రుని పరాక్రమం ముందు తలవంచి తన తపశ్శక్తిని రాముడికి ధారపోశాడు. శ్రీరాముడి వింటినారిని తెంచగలిగిన పరాక్రమవంతుడు ఖరుడు. అటువంటి ఖరుడు, దూషణుడు లాంటి 14 వేలమంది రాక్షసు ల్ని తృటిలో మట్టుపెట్టిన క్షాత్రం రామచంద్రునిది. ఆయన జనన మరణాలకు అతీతుడు. అపార శక్తిమంతుడు. దుష్ట శక్తులన్నిటిని నాశనపరచి, మన కోరికలన్నిటినీ నెరవేర్చే సామర్థ్యం కలవాడు శ్రీ రాముడు. తానొక అవతార పురుషుడునని గానీ, అవతార మూర్తినని గానీ ఎక్కడా ప్రకటించుకోలేదు. శ్రీ రాముని సుగుణగణాలన్నీ విశిష్టమైనవే. అందులో ప్రత్యేకమైంది...ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం. పితృవాక్య పరిపాలనలో మాత్రమే కాదు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలోనూ రామచంద్రప్రభువు ఆదర్శమూర్తే. త్రేతాయుగంలో రాక్షసుల నుండి, దుష్ట శక్తుల బారి నుండి తన భక్తులను, ప్రజలను సంరక్షించడానికి శ్రీ విష్ణువు తీసుకున్న అవతారమే శ్రీ రాముడు. అందుకే...మూడు సార్లు రామనామం జపిస్తే చాలు...విష్ణుసహస్రనామం జపించినంత పుణ్యం లభిస్తుంది.



రాజ్యకాంక్ష, పరులసొత్తుపై వ్యామోహం వంటి దుర్గుణాలు మనిషికి ఉండకూడదని... రామావతారంలో చెప్పడమే కాదు. ఆచరించి మరీ



చూపించాడు. మాటపై నిలబడటం రామచంద్రమూర్తిలో అద్భుత లక్షణం. రాముడికి వనవాసం గురించి తెలిపినప్పుడు దశరథుడు ఒక మాట అంటాడు. వృద్ధుడైన తనను ఖైదు చేసి రాజ్యాన్ని స్వీకరించమని ప్రాథేయపడతాడు. దశరథుడు చేసింది అక్రమమని, ఆయన్ని చెరసాలలో పెడతానని లక్ష్మణుడు అంటాడు. తండ్రి మాటే కాదు, తల్లి మాటా శిరోధార్యం...నువ్వు వనవాసానికి వెళ్లొద్దని కౌసల్య ప్రాథేయపడుతుంది. ఎందరు ఎన్ని చెప్పినా... పితృవాక్యపాలనకే కట్టుబడ్డాడు. తండ్రి మాటని గౌరవిస్తూ...వనవాసానికి వెళ్లాడు.

రాముడి జీవితంలో ప్రతి ఘట్టం మానవాళికి ఒక పాఠం. రాముడి చేత రాక్షస సంహారం చేయించ డానికి, తన తపో బలాన్ని మొత్తం రామ లక్ష్మణులకు ధారపోయడానికి విశ్వామిత్రుడు నిరీక్షించాడు. బండరాయిగా పడి ఉన్న అహల్య రామపాదం కోసం నిరీక్షించింది. త్రిభువన వీరులెవ్వరూ కదిలించడానికి కూడా సాధ్యపడని శివుడి విల్లు రాముడి చేతిలో విరిగిపోవడం కోసం నిరీక్షించింది. అన్న రాక కోసం భరతుడు 14 ఏళ్లు నిరీక్షించాడు. రాముడి వార్త కోసం లంకలో సీతమ్మ 10 నెలలు నిరీక్షించింది. సీతారాముల కోసం అయోధ్య నిరీక్షించింది. రావణ సంహారం కోసం, రాక్షస సంహారం కోసం లోకాలన్నీ ఎంతగా నిరీక్షించాయో కదా. కారణజన్మలకే నిరీక్షణ తప్పలేదు. ఇక సాధారణ మానవులం మనమెంత ? ప్రతి చిన్న దానికి తెగ ఆవేశం తెచ్చుకోవడం, వేచి చూసే ధోరణిని వదిలేయడం, పట్టుదలతో సాధించే క్రమంలో నిరీక్షణ ప్రాధాన్యతని మర్చిపోవడం... విజయాలను దూరం చేయడం మాత్రమే కాదు. అపజయాల ఊబిలో నిలుపుతుంది.ఏ యుగంలో అయినా...అన్నాదమ్ముల అనుబంధమంటే రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులే ఆదర్శం. ఒకే తల్లి కడుపున పుట్టిన పిల్లలే ఈర్షా ద్వేషాలతో కొట్టుకుని చచ్చే ఈ రోజుల్లో తమ్ముళ్లకు రాముడిపై ఉన్న ప్రేమాభిమానాల గురించి, అన్న పై తమ్ముళ్లకి ఉన్న అపారమైన అనురాగం గురించి అందరూ తెలుసుకోవాలి. ఆచరించాలి.



పొద్దున శ్రీరామ పట్టాభిషేకానికి ముహూర్తం. తెల్లవారేసరికి అంతా తలకిందులు. పద్నాలుగేళ్లు అరణ్యవాసం. భరతుడికి పట్టాభిషేకం. రాముడు చెదరని చిరునవ్వుతో అలాగే అంటూ వనవాసానికి సిద్ధమైయ్యాడు. అది చూసి లక్ష్మణుడి గుండె రగిలిపోతే...తనకు రాజ్యమొస్తుందని భరతుడు ఆనందపడిపోలేదు. రాముడ్ని వనవాసం వెళ్లమన్న తల్లి మీదే కన్నెర్ర చేశాడు. చివరకు వనవాసంలో ఉన్న రాముడి దగ్గరకి సకల పరివారంతో వెళ్లి...వెనక్కి వచ్చి సింహాసనం అధిష్టించాలని వేడుకున్నాడు. కష్టాలు, సుఖాలు, అధికారం ఏదీ కూడా అన్నదమ్ములను వీడదీయకూడదన్న నీతి రామకథ చెబుతోంది.







రాముడు పరిపూర్ణ మానవుడు. మనిషికి ఉండాల్సిన అన్ని సుగుణాలకు ప్రతిరూపం. మానవుడిగా పుట్టాడు, పెరిగాడు, కష్టాలు పడ్డాడు. కానీ ఏ సందర్భంలోనూ ధర్మాన్ని తప్పలేదు. ఆదర్శ-పుత్రుడు, ఆదర్శ-శిష్యుడు. ఆదర్శ-భర్త, ఆదర్శ-సోదరుడు. ఆదర్శ-స్నేహితుడు, ఆదర్శ రాజుగా లోకారాధ్యుడు అయ్యాడు. మానవ జీవితానికి అత్యంత సన్నిహితంగా మెలిగింది శ్రీరామావతా రమే. ఎప్పుడైనా తీవ్రమైన ఒత్తిడి మిమ్మల్ని చుట్టేస్తోందా ? తట్టుకోలేని సమస్య మిమ్మల్ని సవాల్ చేస్తోందా ? ఒక్కసారి శ్రీరామచంద్రుడిని తల్చుకోండి. ఒక్కసారి శ్రీరామతత్వాన్ని గమనించండి. మీకు కర్తవ్యం బోధపడుతుంది.



భక్తాజనకోటికి మోక్షమార్గాన్ని ప్రసాదించడానికి మాత్రమే శ్రీరామచంద్రుడు పరిమితం కాలేదు. రామకథ జీవితం అంటే ఏంటో చెబుతుంది. జీవితంలో ఎదురయ్యే సమస్యలు, కష్టాలను ఎలా ఎదుర్కో వాలో, అధిగమించాలో అర్థమయ్యేలా చెబుతుంది. చిన్న చిన్న సమస్యలకే కుంగిపోతూ...గగ్గోలు పెడుతూ, జీవితం ఏదో అయిపోయిందని తెగ హైరాన పడుతోన్న నేటి



యువతకి...రామాయణం,

శ్రీరాముడు... తిరుగులేని మేనేజ్మెంట్ పాఠం. రాముడు దశరథ మహారాజు కుమారుడు. పుట్టుకతోనే మహా వైభోగాల మధ్య పెరిగిన వాడు. హంసతూలికా తల్పాలు. వశిష్ఠాది సకల శాస్త్ర పారం గతుల శిక్షణ. అందానికి అందం. విద్యలకు విద్యలు. సంపదకు సంపద. కాబోయే మహారాజుగా అధికారానికి అధికారం. అయినా... నారచీరలు కట్టుకుని, జుట్టుకు మర్రిపాలు పూసుకుని, అడవుల్లో కందమూలాలు తవ్వుకుని తింటూ 14 ఏళ్లు గడిపాడు. లక్ష్మణుడు పైకెక్కి కుటీరం నిర్మిస్తుంటే రాముడు గడ్డిమోపులు అందించాడు. కొండా కోనల్లో ఎండా వాననక తిరిగాడు. ఎక్కడ అయోధ్య? ఎక్కడ లంక? వేల కిలో మీటర్లు నడిచాడు. అందుకే పగవాడికి కూడా రాముడి కష్టం రాకూడదంటారు.



శ్రీరామచంద్రుడిలా కష్టాలను, సుఖాలను ఒకేలా చూడటం, రెండు సమయాల్లోనూ ఒకలా స్పందించడం నేర్చుకుంటే...జీవితంలో ఎన్నికష్టాలు ఎదురైనా ఓటమి మన దరిచేరదు. ఎవరితో ఎలా వ్యవహరించాలి ? ఎవరి నుంచి ఎలాంటి సాయం తీసుకోవాలన్నవి ఈ రోజుల్లో చాలా ముఖ్యం. దీన్ని మ్యాన్పవర్ మేనేజ్మెంట్ అంటారు. రామాయణాన్ని కాస్త నిశితంగా పరిశీలిస్తే... మ్యాన్పవర్ మేనేజ్మెంట్లో మీతో పోటీ పడేవారే ఉండరు. రాముడు భరద్వాజుడి సాయంతో కుటీరానికి చోటు ఎంపిక చేసుకున్నాడు. లక్ష్మణుడి సాయంతో అడవిలో గుడిసె కట్టుకున్నాడు. గుహుడి సాయంతో గంగ దాటాడు. జటాయువు చెబితే సీతాపహరణం గురించి తెలుసుకు న్నాడు. శబరి చెబితే





బాట పట్టుకుని సుగ్రీవుడి దగ్గరికి వచ్చాడు. హనుమ చెబితే స్నేహం చేశాడు. కోతుల సాయం తీసుకున్నాడు. అగస్త్యుడు చెబితే ఆదిత్య హృదయం చదివి రావణుడిని గెలిచాడు. ఒక పక్షి, ఒక కోతి, ఒక ఎలుగుబంటి, ఒక ముసలి, ఒక రుషి ఎవరు చెప్పినా విన్నాడు. వాళ్ళందరి సాయం తీసుకున్నాడు. అందరి శక్తులను కలుపుకున్నాడు. అందరి సేవలను, బలాన్ని ఉపయోగించుకోవడం తెలియాలంటే.. .రామకథని అధ్యాయనం చేయాలి. ఎమోషనల్ మేనేజ్మెంట్లో పట్టు సాధించలేక...ఈ రోజుల్లో చాలా మంది మానసికంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. సమస్యలను ఫేస్ చేయడం, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషిం చడం మాత్రమే కాదు. ఆ సమయంలో మానసికంగా ధృడంగా ఉండటం కూడా చాలా అవసరం. రాముడికి రాజ్యం లేదు. భార్యను ఎవరో అపహరించారు. పరివారం లేదు. అసలే అడవులు. ఎండకి, వానకీ ఇబ్బందే. రాత్రిళ్లు దోమలు. ఇన్ని సమస్యలను రాముడు తట్టుకోవడానికి, అధిగమించడా నికి కారణం మానసికంగా ధృడంగా ఉండటమే. ఎమోషనల్గా స్ట్రాంగ్గా లేకపోతే ఒక సమస్యని ఎదుర్కొలేక పది కష్టాలను కొనితెచ్చుకోవాలి. అందుకే...ఎమోషనల్ మేనేజ్మెంట్ పై పట్టు దొరకాలంటే... రామాయణ పఠనానికి మించిన మార్గం లేదు. రాముడికి మించిన గురువే లేరు. శ్రీమహావిష్ణువే మానవుడుగా రామావతారంలోకి రావడానికి కారణం దుష్టశిక్షణ, శిష్టరక్షణ మాత్రమే కాదు. ప్రతి యుగంలోనూ మానవుడిని వేధించే సమస్యలకు, కష్టాలకు పరిష్కారమార్గాలు చూపిం చడం కూడా ఒక కారణం. రామచంద్రుడి నుంచి అద్భుతమైన గుణగణాలను అలవర్చుకోవడం మాత్రమే కాదు. మన చుట్టూ నక్కి ఉండే మంథర లాంటి వాళ్లని పసిగట్టి జాగ్రత్త పడమని కూడా రామాయణం హితబోధ చేస్తూనే ఉంటుంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా...మన చుట్టూ అదును కోసం చూస్తున్న మంథరలు చెలరేగిపోతారు.









# కల్యాణ వైభోగమే!



చూశారుగా. భరతుడి కన్నా ఎక్కువుగా ప్రేమించే రాముడి మీదే కైకేయి మీద ద్వేషం పుట్టించింది మంథర. చాడీలు చెప్పి...ద్వేషం నూరిపోసి...కైకేయి మనసు విరిచి...అలక పాన్పు ఎక్కించి... సీతారామ లక్ష్మణులు అడవికి వెళ్లేలా చేసింది. మన మిత్రులు, ఇరుగు పొరుగు, బంధువులు ఇలా ఎవరో ఒకరి రూపంలో ఉన్న మంథరలని పసిగట్టి జాగ్రత్త పడకపోతే పెను కష్టాలు తప్పవని రామా యణం హితబోధ చేస్తూనే ఉంది. అలానే హనుమంతుడు స్వామి భక్తిలో ఎంతటి గొప్పవాడులో కార్యసాధనలోనూ అంతటి తిరుగులేని సమర్థుడు. ఎక్కడ, ఎవరితో, ఏమి, ఎలా, ఎందుకు మాట్లాడు తున్నామో అన్న స్పృహ...ఈ రోజుల్లో చాలా అవసరం. హనుమంతుడు తన ప్రతి చర్యలోనూ ఈ



పాఠాలను చెబుతూనే ఉంటాడు. రామాయణ మంతా వేద సారం. మంత్రమయం. అందులో సుందరకాండ మరీ ప్రత్యేకం. హనుమంతుడు నవ వ్యాకరణ పండితుడు. సూర్యుడి దగ్గర శిష్యరికం చేసినవాడు. తపస్వి. సుగ్రీవుడి మంత్రి. భక్తుడు. సేవకుడు. రాయబారి. కార్యసాధకుడు. యోధుడు . పరాక్రమశాలి. అశోకవనంలో సీతమ్మని రావణాసుడు బంధించి పది నెలలు అవు తుంది. తెల్లవారక ముందే రావణుడు వచ్చి.. .సీతకి చివరి హెచ్చరిక ఇచ్చి వెళతాడు. హనుమంతుడు రావడం రెండు నిమిషాలైతే సీతాదేవి ఆత్మహత్య చేసుకునేదే. అలాంటి సమయంలో... సీతాదేవిని చూసిన హనుమంతుడు ఆమెతో సంస్కృతంలో మాట్లాడలేదు. ఎందుకంటే... అప్పుడే రావణుడు సంస్కృతంలో మాట్లాడి వెళ్లాడు. దీంతో...తానూ సంస్కృతంలో మాట్లాతే రాక్షస మాయ అని సీతాదేవి భ్రమపడుతుందేమో అని...సీతమ్మ సొంత ఊరు మిథిలా నగరవాసులు అయోధ్యలో మాట్లాడే ప్రాకృత భాషలో మాట్లాడి..మొదటి మాటకే ఆమె ఉపశమనం పొందేలా చేశాడు. ఆ తర్వాత శ్రీరాముల ఉంగరం సీతమ్మకి చూపించాడు.









మానవ జీవితంలో ఎదురైయ్యే సమస్యలను, కష్టాలను ఎలా ఎదుర్కోవాలో, అధిగమించాలో రామకథ నేర్పుతూనే ఉంటుంది. మన దేశంలో రామాలయం లేని గ్రామమే ఉండదు. భారతీయులంతా శ్రీరాముడిని ఎందుకిలా ఆరాధాస్తారంటే...ఎన్నో రకాలుగా సమాధానాలు చెప్పొచ్చు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోగల వ్యక్తిత్వం రాముడి సొంతం. శ్రీరాముడి ప్రతిచర్యలోనూ సీతాదేవి గొప్పదనం ప్రతిఫలిస్తుంది. అందుకే రామాయణాన్ని సీతాయాశ్చరితం మహత్ అన్నాడు వాల్మీకి. అంటే గొప్పదైన సీతాచరితం అని అర్థం. ఆదర్శ దంపతులైన ఆ సీతారాముల చరితం సకల మానవాళికి అన్ని కాలాల్లో ఆదర్శనీయమే.

అనిల్ కుమార్ కుంట....
SANDESH PLUS
93933 44405